క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం

వినుకొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని కట్టక్రింద బజారు, ఓబయ్య కాలనీ వార్డు సచివాలయాల పరిధిలో, మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకయ్య సోమవారం తెలియచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని, సచివాలయల ద్వారా అందించు 11 రకాల ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. కార్యక్రమానికి చైర్మన్, వైస్‌చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు పాల్గొనాలన్నారు.

లబ్ధిదారుల అర్హతపై విచారణ

బొల్లాపల్లి: మండలంలోని గండిగనుమల సచివాలయ పరిధిలో దోమలగుండం గ్రామానికి చెందిన ఎస్టీ రైతులు కార్పొరేషన్ సాయంతో ఏర్పాటు చేసే బోర్లు మోటార్లకు దరఖాస్తు అందజేశారు. ఎస్టీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంబంధిత రైతులకు బోర్లు ఏర్పాటు చేయటం మోటారుతో పాటు కరెంటు సరఫరా జరుగుతుంది. గ్రౌండ్ వాటర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల దరఖాస్తులు పరిశీలించి సోమవారం విచారణ చేపట్టారు. గ్రామం నుంచి 43 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని వీటిపై రెండు రోజులు పాటు విచారణ పూర్తి చేస్తామని ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషా తెలిపారు. క్షేత్ర స్థాయి విచారణలో గ్రౌండ్ వాటర్ విభాగం బిందు శ్రీ, ఉమాదేవిలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆహుతైన ఇళ్లు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామం ఎస్టీ కాలనీలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన వారు సర్వస్వం కోల్పోయి భారీగా ఆస్తి నష్టవాటిల్లింది. కాలనీకు చెందిన ఇండ్ల అంకమ్మరావు, తలుపుల సుధాకర్ ఇరువురు నివాస గృహాల్లో వంట చేస్తుండగా ఆదివారం ప్రమాదవశాత్తు మంటల వ్యాపించి రెండు ఇళ్లు అహుతయ్యాయి. ఈ ప్రమాదంలో ఒకరి ఇంట్లో రెండు సవర్ల బంగారం, రూ. 50 వేలు నగదు అగ్నికి అహుతి అయ్యాయి. తహసీల్దారు షేక్ జాన్‌సైదులు సూచనల మేరకు రెవెన్యూ సిబ్బంది బాధితులు ఒక్కొక్కరికీ 10 కేజీల బియ్యం అందజేశారు. ఆయనతో పాటు సర్పంచ్ బోడాల వీరాంజినేయులు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, వీఆర్వో వేణుగోపాలపావు పాల్గొన్నారు.

పౌరాణిక పద్య పోటీలకు రండి

వినుకొండ టౌన్: స్థానిక జాషువా కళా ప్రాంగణంలో మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమాన్ని, జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు మందా వెంకట్రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురజాల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తిని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలసి, కార్యక్రమాలకు హాజరు కావాలంటూ ఆహ్వానించడం జరిగిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని కళాకారులు ఈ పోటీలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కార్యదర్శి సురభి దేవ సహాయం, నెల్లూరుకు చెందిన ప్రజా జ్యోతి చైతన్య కళావేదిక చైర్మన్ కె. రమణ శ్రీ, కొట్ర సాగర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఆటోలు సీజ్

నరసరావుపేట టౌన్: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న మూడు ఆటోలను సీజ్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు జరిమానా విధించామన్నారు. ఓవర్‌లోడ్‌తో వస్తున్న మూడు ఆటోలను సీజ్ చేశామన్నారు. చర్యల నిమిత్తం రవాణ శాఖకు సిఫార్స్ చేసినట్లు సీఐ తెలిపారు. నిబంధనలకు లోబడి వాహనదారులు నడుచుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యడ్లపాడు: జాతీయ రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో గాయపడ్డ ముగ్గురిలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు గ్రామంలోని ఎస్సీ (ఎగువ) కాలనీకు చెందిన కట్టా వీరయ్య ఆదివారం గ్రామ పరిధిలోని ఉప్పువాగు వద్ద పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నడానికి వెళ్లాడు. పని పూర్తయిన అనంతరం అదే కాలనీకు చెందిన బత్తుల యోబు, కత్తి మరియదాసును ట్రాక్టర్‌పై ఎక్కించుకుని ఇంటికి బయలుదేరాడు. లిఫ్టపథకం గది ముందుగా ఉన్న 16వ నంబర్ జాతీయ రహదారి పైకి ట్రాక్టర్ ఎక్కే క్రమంలో వారి ట్రాక్టర్‌కు బైక్ అడ్డుగా వచ్చింది. దీంతో స్లోపింగ్ అధికంగా ఉండటంతో అదుపుతప్పిన ట్రాక్టర్ పల్టీకొడుతూ పొలాల్లోకి వెళ్లి పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న ముగ్గురికీ గాయాలు కాగా కాటూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బత్తుల యోబు (48) మృతి చెందాడు. ఆయనకు భార్య విజయమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లాడ్జీలో అనుమానాస్పద మృతి

నరసరావుపేట టౌన్: అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలంలో చెరుకుపాలెం గ్రామానికి చెందిన ఉప్పు యోగయ్య (40) ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీనివాస లాడ్జిలో అనుమానస్పదంగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఎన్. వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద లభ్యమైన వైద్యశాల ఓ.పీ షీట్ ఆధారంగా నరసరావుపేటలోని వైద్యశాల్లో చూపించుకునేందుకు పట్టణానికి వచ్చినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వలంటీర్లకు వందనం

వలంటీరు సాయం మరువలేనిది



నాదెండ్ల: నా పేరు రెడ్డిమల్లి ముత్యాలమ్మ, కరోనా మొదటి వేవ్ సమయంలో నాకు నరసరావుపేటలోని మాక్సీవిజన్ ఆసుపత్రిలో కంటి పరీక్షలు చేయించుకున్నాను. కంట్లో శుక్లాలున్నాయని డాక్టర్లు చెప్పటంతో అక్కడే ఆపరేషన్ కూడా చేయించుకున్నా. కరోనా కావటంతో నన్ను చూసేందుకు బంధువులు ఎవరూ రాలేదు. ఆ సమయంలో గ్రామానికి చెందిన వలంటీర్ దారెడ్డి సీతమ్మ నరసరావుపేట వచ్చి నాకు పింఛను అందజేసింది. ఇంటికి వచ్చాక కూడా మా అవసరాలకు సహాయం చేస్తూ వచ్చింది. ఆసుపత్రిలో ఉన్న సమయంలో పింఛను సొమ్ము ఎంతో అక్కరకు వచ్చింది. వలంటీరు చేసిన సాయం మరువలేనిది.



ముత్యాలమ్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ దారెడ్డి సీతామ్మ (ఫైల్)

వలంటీర్ల సేవ అపారం



నాదెండ్ల: నా పేరు బండి నరసమ్మ. మాది గొరిజవోలు. కోవిడ్ సమయంలో నేను కిందపడటంతో కాలు విరిగింది. స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేరే స్తోమత లేక గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేరా. అక్కడ వైఎస్సార్ ఆరోగ్యశ్రీక్రింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. ఆ సమయంలో వలంటీర్ గారపాటి సుధారాణి వ్యయ ప్రయాలసకకోర్చి ఆసుపత్రికి వచ్చి నాకు పింఛను సొమ్ము అందించింది. ఎంతో ఆప్యాయంగా పలకరించి పరామర్శించింది. మా కుటుంబ సభ్యులు ఊహించని విధంగా ఆమె ఆసుపత్రిలో పింఛను సొమ్ము అందించటంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో పింఛను తీసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం వలంటీర్లే ఇంటికి వచ్చి పింఛను సొమ్ము ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోదఫా అధికారంలోకి రావాలని మా ఆశ.

జగనన్న హామీలు అమలయ్యాయి

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని
- నాదెండ్లలో గడప గడపకు కార్యక్రమం



ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ధైర్యంగా ఎవరితో పొత్తు లేకుండా ఎన్నికలకు వెళ్తున్న ప్రజల ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని రాజీవ్ కాలనీలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరిస్తూ గడప గడపను తట్టారు. మహిళలతో మమేకమౌతూ, వృద్ధులు, చిన్నారులు, యువతను పలకరిస్తూ ముందుకసాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేసి దేశంలోనే చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మెహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, జగనన్న విద్యాకిట్లు, గోరుముద్ద, వసతిదీవెన, నాడూ నేడు వంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్య బలోపేతానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. 108, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్ వంటి కార్యక్రమాలు పేదలకు నాణ్యమైన వైద్యాన్ని దరిచేర్చిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రపంచంలోనే గొప్ప కార్యక్రమాలు మన ప్రభుత్వంలో జరుగుతున్నాయన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ పాలన వచ్చిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, కనీస మద్దతు ధర నిధి, మార్కెట్ యార్డుల బలోపేతం ద్వారా రైతుల పంటలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించారన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సుపరిపాలనను ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

గ్రామంలో మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలోని లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని దరి చేర్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, జగనన్న సురక్ష కన్వీనర్ అల్లడి రవికుమార్, మద్దూరి కోటిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి, పత్తి వెంకట్ రత్తయ్య, పట్టణ అధ్యక్షుడు తలహాఖాన్, కట్టిబోయిన వీరాస్వామి, ఎంపీటీసీలు గుడికందుల యల్లారావు, కుంభా అంకమ్మ, దావల యేసమ్మ, ఏలియ్య, కొరివి లక్ష్మయ్య, దార్ల పరమేశ్వరరావు, కాట్రగడ్డ రామకృష్ణయ్య, కోనేటి నాగయ్య, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందించడమే గడప గడప లక్ష్యం

వినుకొండ (నూజిండ్ల): అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడమే గడప గడపకు ముఖ్య లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని లాయర్స్ స్ట్రీట్-2 సచివాలయ పరిధిలోని 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వార్డులో పర్యటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లబ్ధిదారులకు అందించిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యల ఉంటే తెలియచేయాలని అక్కడి వారికి తెలియచేస్తూ నవరత్నాల ద్వారా జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, జగనన్న కాలనీల ద్వారా నిరుపేదలకు ఇండ్ల పంపిణీ, చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, వైస్ చైర్మన్ బేతం గాబ్రియల్, మున్సిపల్ అధికారులు, వార్డు కౌన్సిలర్లు సానాల పుల్లయ్య, షేక్ షకీలా, మహబూబ్ సుభాని, ముస్లీం మైనార్టీ అధ్యక్షులు పీఎస్. ఖాన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న నాయకులు, అధికారులు

శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజిండ్ల): అర్హులైన ఏ ఒక్కరు కూడా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా ఉండకూడదనే ప్రధాన లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించడం జరిగిందని స్థానిక శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వినుకొండ రూరల్ అందుగుల కొత్తపాలెం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చేతుల మీదుగా సచివాలయం ద్వారా అందించే 11 రకాల ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో శాచ్యురేషన్ పద్ధతిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మంచి చేసిన జగనన్న ప్రభుత్వం, ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెలరోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ మంగాపురనాథ్, ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట్రామి రెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, మండల కన్వీనర్ దండు చెన్నయ్య, ములకారామ తులసిరెడ్డి అధికారులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వనికుంట, ముప్పాళ్ళలో...

ఈపూరు: జగనన్న సురక్ష లబ్ధిదారులకు ఏంతో ఉపయోగకరమని ఎంపీడీవో రంగనాయకులు అన్నారు. మండలంలోని వనికుంట, ముప్పాళ్ళ గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వనికుంట గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన జననన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీవో రంగనాయకులు పాల్గొని మాట్లాడుతూ ఏన్నో సంవత్సరాల నుంచి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు కోసం నిరీక్షణ చేసిన లబ్ధిదారులకు అందరికీ వరమన్నారు. వనికుంట గ్రామసచివాలయ పరిధిలో మండలంలోని అత్యధికంగా 515 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బయ్యారపు రమ్య రవికుమార్, సుబ్బయ్య, ఎంపీటీసీలు మాచర్ల ఏప్రాయేల్, సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, దుడ్డికుల జానయ్య, అంగజాల కోటేశ్వరరావు, తహసీల్దారు వెంకటేశ్వర నాయక్, ఏవో రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల శ్రేయస్సు కోరే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం

నరసరావుపేట: రాష్ట్రంలో వివక్ష చూపని పాలనతో సువర్ణ అధ్యాయానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాందీ పలికారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పట్టణంలోని ఎనిమిదవ వార్డు ఇస్లాంపేట్ సచివాలయంలో సోమవారం మున్సిపల్ ఇంజినీర్ డి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పాల్గొని మాట్లాడారు. వార్డులోని ఇస్లాంపేట సచివాలయ పరిధిలో రూ.7.78 కోట్లతో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందజేశామన్నారు. అనంతరం ఆదాయ, కుల, జనన మరణ, తదితర 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, వార్డు నాయకులు షేక్ కరిముల్లా, షేక్. ఖాజా, సయ్యద్ ఫాతిమూన్, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ప్రజలకు పూర్తిస్థాయి లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామ సచివాలయం-1లో సోమవారం జగనన్న సురక్ష సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల పౌర సేవలు పొందేందుకు వీలుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన ఈ సువర్ణ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ బి.వరూధిని, సర్పంచ్ కె.హేమ, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్, ఏవో సీహెచ్ సరిత, మండల సచివాలయ కన్వీనర్ రాచమంటి చింతారావు ప్రసంగించిన వారిలో ఉన్నారు. అనంతరం 454 మందికి వివిధ రకాల పౌర సేవల ధ్రువ పత్రాలను అతిథులు అందజేశారు.

ప్రజల అవసరాలు తెలిసిన ముఖ్యమంత్రి

నాదెండ్ల: ప్రజల అవసరాలు తెలిసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండలంలోని కనపర్రు సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు హాజరయ్యారు. సచివాలయం పరిధిలో 1500 గృహాలకు గాను 1350 గృహాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సందర్శించి సుమారు 500 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీటీసీ పచ్చవ సీతారామయ్య, గణపవరం, నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, గ్రామ పార్టీ నాయకులు పచ్చవ కోటేశ్వరరావు, ఏవో హరిప్రసాద్, డీటీ అనురాధ, ఆర్ఐ షేక్ రమీజా, వీఆర్వో మురళీకృష పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

శావల్యాపురం: కరోనా సమయంలో వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. సోమవారం శావల్యాపురం గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమక్షంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పేదలందరికీ సంక్షేమ పథకాలు నూరు శాతం అందేలా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ చేసి ధ్రువపత్రాలిచ్చారు

నేను వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నా. నా ఇరువురు కుమారులు చదువుకుంటున్నారు. వారి విద్య అవసరాల నిమిత్తం 24 గంటల క్రితం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా. సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్లు తీసుకోమని అధికారులు ఫోన్ చేశారు. రూపాయి ఖర్చు లేకుండా నేను సర్టిఫికెట్లు పొందా.

–మెడబలి ఇన్నయ్య, కనపర్రు

రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు

మాది వ్యవసాయ కూలీ కుటుంబం. కొద్దిరోజుల క్రితం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చారు. మీకేం సమస్యలున్నాయని అడిగారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమని చెప్పాం. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎలాంటి ఖర్చు లేకుండా మాకు ధ్రువీకరణ పత్రాలు చేతికిచ్చారు.

–ముదవర్తి రేణుక, కనపర్రు ఎస్సీ కాలనీ

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఎమ్మెల్యే ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

శావల్యాపురం: మండల కేంద్రంలో తాగునీటి ఇక్కట్లు అనే సాక్షి కథనానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్పందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తాగునీటి విషయంపై ప్రజాప్రతినిధులు అధికారులతో సమీక్షించారు. గ్రామంలో మంచినీటి పథకం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ దుస్థితి వచ్చిందని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించాలన్నారు. రక్షిత మంచినీటి పథకం నిర్వహణకు ప్రజల భాగస్వామ్యంతో పాటు వలంటీర్లు ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించాల్సిన నగదు అందజేసి పథకం నిర్వహణకు సహకరించాలన్నారు. తరుచూ విద్యుత్ మోటార్లు మరమ్మతులకు గురౌతున్నాయని, తక్షణమే మండల నిధులు రూ. లక్ష రూపాయలు వెచ్చించి నూతన విద్యుత్ మోటార్లు రెండు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోకి తాగు నీరు విడుదల చేసే ఆపరేటర్ వేతనం పెండింగ్‌లో లేకుండా పంచాయతీ కార్యదర్శి ముందు జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. మంచినీటి చెరువు నీరు దుర్వాసన వస్తోందని, నీరు రంగు మారాయని గ్రామస్తులు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బొల్లా సత్వరమే అధికారులు చెరువులో బ్లీచింగ్ చల్లించి ప్రజలకు మంచినీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, ఎంపీటీసీ దేవనబోయిన పోతురాజు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, కార్యదర్శి డి.రవీంద్రబాబు, మండల కోప్షన్ సభ్యులు హుస్సేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుని చెంతకే నిత్యావసరాలు

శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు



మహిళలకు కందిపప్పు అందచేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మక్కెన

వినుకొండ టౌన్: సామాన్యుడి చెంతకు నిత్యవసర ధరలను తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. వినుకొండ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తక్కువ ధరలకు కందిపప్పు, బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వైఎస్సార్ సీపీ నాయకులు మక్కెన మల్లిఖార్జునరావుతో కలిసి పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయటి మార్కెట్‌లో ప్రస్తుతం దేశవాళి కందిపప్పు దాదాపు 150 రూపాయలు, ఆఫ్రికన్ రకం 130 ఉండగా, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సూచనలతో కలెక్టర్ లోతేటి శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌ల ఆదేశాల మేరకు దేశవాళి కందిపప్పు 130 రూపాయలు, ఆఫ్రికన్ రకం 115 ఇచ్చేందుకు దాల్ మిల్లర్లు ముందుకు రావడం జరిగిందన్నారు. అదే విధంగా కిలో బియ్యం దాదాపు 58 రూపాయలు ఉండగా 49 రూపాయలకు ఇచ్చేందుకు రైసు మిల్లర్లు ముందుకు వచ్చారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మరలా మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విక్రయించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీఓ మంగాపురనాథ్, ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకట్రామి రెడ్డి, కౌన్సిలర్ షేక్ షకీలా, అధికారులు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, రైస్ అండ్ వినుకొండ దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికీ మంచినీరు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్‌డీ జానీబాషా



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ లక్ష్మణ్

నరసరావుపేట రూరల్: జలజీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి సురక్షితమైన మంచినీరు అందించడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్‌డీ జానీబాషా తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయంలో జలజీవన్ మిషన్ పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏఈ మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకంలో గ్రామానికి రూ.58 లక్షలు మంజూరు అయినట్టు తెలిపారు. ఇంటింటికీ కుళాయి ఇవ్వడంతో పాటు స్వచ్ఛమైన తాగునీటి అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. స్వయం సహాయక బృందాల పర్యవేక్షణలో జల జీవన్ మిషన్ పనులు నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించినట్టు తెలిపారు. సదస్సులో గ్రామ సర్పంచ్ వడ్డే మాలశ్రీ, డీపీఎంయు కోఆర్డినేటర్ లక్ష్మణ్, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సతీష్, వడ్డే వీరాంజనేయులు, వడ్డే దేశింగరావు, జేజేఎమ్ కోఆర్డినేటర్లు డి.కోటేశ్వరరావు, బాబురావు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన తప్పనిసరి



శిక్షణ తరగతులను ప్రారంభించిన డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని

యడ్లపాడు: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై అవగాహన తప్పనిసరి అని ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎం సుభాని చెప్పారు. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌సీఈఆర్‌టీ, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం సోమవారం పల్నాడు జిల్లా ఉపాధ్యాయులకు మొదలైంది. ప్రారంభ సభలో సత్తెనపల్లి డీవైఈవో కె.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ప్రాథమికస్థాయి నుంచే జీవన నైపుణ్యాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన ఈ వినూత్న విద్య పథకం విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. బోయపాలెం జిల్లా విద్యా శిక్షణ సంస్థలో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు పల్నాడు జిల్లా పరిధిలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 100 మంది పీడీ/పీఈటీ, యాక్టివ్ టీచర్ ఒకరు చొప్పున హాజరయ్యారు. ఫౌండేషన్ సౌత్ ఇండియా టీం సభ్యులు శిక్షణ లక్ష్యం గురించి వివరించారు. డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.ప్రసాద్, కె.యోగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

నిబంధనలు పాటించాలి

నాదెండ్ల: నర్సరీ యజమానులు 2010 నర్సరీ యాక్ట్ నిబంధనలు పాటించాలి ఉద్యానవన శాఖ అధికారి ఎస్.కిషోర్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్లలోని షేడ్‌నెట్‌లను సోమవారం ఆయన సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయనతో పాటూ సహాయకురాలు వేదవతి ఉన్నారు.

విద్యార్థులకు చేయూతనందించాలి

చిలకలూరిపేట: పేద విద్యార్థుల చదువులకు చేయూతనందించాల్సిన ఆవశ్యకత ఉందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. పట్టణంలోని కేజే ఆసుపత్రి ప్రాంగణంలో సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ చదువుతున్న కార్తీక్‌కు స్మార్ట్ ఫోన్, ఆరో తరగతి చదువుతున్న జోసెఫ్‌కు ఫీజు నిమిత్తం ఆర్థిక సహాయం, పుస్తకాలు, మరో వ్యక్తి మణికు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం ఇలా మొత్తం రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు.

ఉపాధి హామీపై ప్రజావేదిక

రొంపిచర్ల: స్థానిక ఎండీవో కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజా వేదికను నిర్వహించారు. 2022-23 సంవత్సరంలో నిర్వహించిన రూ.8.58 లక్షల రూపాయల పనులపై తనిఖీలు జరిగాయి.